



"నేనివాళ ఆలస్యంగా వస్తాను యింటికి." టైనాట్ వేసుకుంటూ అన్నాడు మహేష్.

అద్దంలో కన్పిస్తున్న అతని ప్రతిబింబం వైపు చూస్తు చిరునవ్వు నవ్వింది మాలిని.

"వెరీగుడ్. రజీ ఫోన్ చేసి యివాళ ఫస్ట్‌షోకి వెళ్దాం. రెడీగా వుండమన్నది. ఏం చేద్దామా అనుకుంటున్నాను. ఎలాగు మీరు ఆలస్యంగా వస్తానన్నారు.... నేను, రజి పిక్చర్‌కి వెళతాం."

వెనుతిరిగి భార్య కళ్ళల్లోకి చూశాడు మహేష్.

నిర్మలంగా నవ్వుతున్నాయి, ఆ కళ్లు.

ఏదో అనబోయి ఆగిపోయాడు... "ఓ. కె దెన్. నేను వెళ్తున్నాను." అన్నాడు కూలింగ్ గ్లాసెస్ తీసుకుంటూ.

"థాంక్యూ వెరీమచ్ డార్లింగ్." నవ్వుతూ అతన్ని పెనవేసుకుంది మాలిని.

సున్నితంగా ఆమె పెదాలు తాకి వెళ్ళిపోయాడు మహేష్

అతను కనుమరుగు అవగానే ఆమె మొహం సీరియస్‌గా మారిపోయింది.

టెలిఫోన్ వైపు కదిలాయి ఆమె పాదాలు.

రెండు మూడు రింగ్స్ కాగానే అవ తల నుండి రెస్పాన్స్ వచ్చింది.

తను సాయంత్రం వాళ్ళ యింటికి వస్తున్నట్లు. పిక్చర్ కి రెడీగా వుండమని చెప్పింది.

మరు మాట లేకుండ ఓ. కె అంది రజనీ.

పిక్చర్ లో కూర్చున్న మాలిని మనస్సు మహేష్ చుట్టే తిరుగుతోంది. "వారానికి నాలుగురోజులు నేనివాళ అలస్యంగా వస్తాను యింటికి అని చెప్పడం పరి పాటయిపోయింది. కారణం మాత్రం చెప్పరు. ఆయనలా అన్నప్పుడల్లా తను వెంటనే ఎక్కడికో వెళ్ళాలని అను కున్నట్లు సంతోషంగా చూస్తూ ఇక్కడికి వెళాం అనుకున్నాను అని చెప్పడం ఆయన అదోలా చూసి ఓ. కె అనడం కూడా పరిపాటు అయిపోయింది."

"ఏయ్.... మాట" చేతిమీద గట్టిగా గిల్లింది రజని.

ఉలిక్కిపడుతూ ఈ లోకానికి వచ్చే సరికి హాలంతా నవ్వులతో దద్దరిల్లుతోంది.

స్క్రీన్ మీద కమెడియన్ పెట్టిన మొహం, ఎక్స్ప్రెషన్స్ చూసి ఏదో జోక్ దొర్లిందనుకుని మనస్సుని పిక్చర్ మీద లగ్నం చెయ్యడానికి ప్రయత్నిం చింది, మాలిని.

మాలినిని ఇంటి దగ్గర దింపుతూ...

"నువ్వేదో పరధ్యానంగవున్నావు ఇవాళ. ఏమిటి సంగతి?" అని అడిగింది రజని.

"ఏం లేదు రజీ, కాస్త తలనొప్పిగా వుంటేను ...వుంటాను మరి బై ..." అంది చెయ్యి వూపుతూ.

తిరిగి చెయ్యి వూపింది రిక్షా కదిలింది.

తొమ్మిదిన్నర ప్రాంతాల్లో యింటికి వచ్చాడు మహేష్.

క్లబ్బుకి వెళ్ళొస్తుంటే మహేష్ కోసారి మాలిని గురించి జ్ఞాపకం వచ్చింది.

"తను ఆలస్యంగా వస్తానని చెప్ప నప్పుడు రాని ప్రోగ్రామ్స్ తను ఆల స్యంగా వస్తానని చెప్పగానే వస్తాయి? కావాలని చేస్తోందా? ఎందుకు? ఎందుకు?" ఆలోచిస్తూ సోఫా లో వాలిపోయాడు మహేష్.

"మాలిని ఎలాగైనా వినదుకుండ. ఆమె గురించే తక్కువగా అంచనావేస్తే అది నిజంగా పొరపాటే ...ఆమె ఎదురు తిరిగి చురక వేసే తను నిజంగా బల హీనుడు. చెస్ లో తననే అతినేర్పుగా ఓడించే మాలిని ఎత్తులు వెయ్యడంలో అందెవేసిన చెయ్యి."

"ఎంత సేపయింది వచ్చి?"

ఆశ్చర్యంగా వినిపించాయి మాటలు.

కళ్ళు తెరవగానే సోఫా దగ్గరగా, తన మీదగా వంగిన మాలిని కనిపించింది.

